# రంగులు

అప్పుడే తలుపు తోసుకువచ్చిన విశ్వం,– జేబు రుమాలుతో చమట తుడుచుకుంటూ, నలిగిన బట్టలు సర్దుకుంటూ వాళ్ళింట్లోంచే స్తున్న నన్ను చూసి గతుక్కుమన్నాడు!

అతడు లేకుండా, నేనొక్కణ్ణి ఒంటరిగా అక్కడ వుంటానని... ఎలా అనుకోగలడు? క్రొత్తగా పెళ్ళాడిన భార్యా తనూ ఇద్దరే వుంటున్న ఆ ఇంటిలో...

వెంటనే...

"నువ్విక్కడున్నావా?" అని అనుమానాస్పదంగా అన్నాడు.

అతని ముఖం నిముషంలో అదోలా మారిపోయింది.

ముఖంలో కల్మషం, ఉద్రేకం, తహతహ, ఎవరినో మింగేద్దామన్నంత కోపం... అతనిలో వున్నట్టు అనుకున్నాను.

నే చెప్పే జవాబయినా వినిపించుకొనేట్టు లేదు.

చిరాకుతో, లోపలికి వెళ్ళి నాలుగు ప్రక్కలా కలియజూసేడు. ఎవరూ లేకపోవడం చూసి, నా వైపు ఒకసారి తీక్షణం తిరిగి చూసి పిచ్చెత్తినవాడిలా, మాట్లాడకుండా, అటు మంచంవైపూ— చిందర వందరగా వున్న బట్టల దండెంవైపూ... నేను తిన్న టిఫిను పళ్ళెంవైపూ... పరీక్షగా చూసేడు. నిప్పులు తొక్కేడు! కాని ఉద్రేకాన్ని పైకి కనబడకండా అణచుకుందికి ప్రయత్నిస్తున్నాడు... మొఖం మాత్రం ఎర్రగా మారిపోయింది, శరీరం వణుకుతున్నట్టు గమనించాను.

"ఇలా వెళ్ళినట్టుంది! ఎక్కడికి వెళ్ళిందోయ్!" అన్నాడు. పెరటి వైపు చూస్తూ... బహుశా పెరట్లో వాడి భార్య ఎండవేసిన చీర గాలికి ఎగరడం చూసి అలాగనుకున్నాడేమో!

అతగాడి వాలకం చూసి నాకు నవ్వొచ్చింది!

నేను జవాబు చెప్పేవరకూ అతడాగలేదు. నా జవాబుని అతడప్పుడే వూహించుకున్నాడేమో! వాడి ఉద్దేశంలో నే చెప్పింది అతనికి నచ్చదు. అందుకే కాబోలు వినదలుచుకోలేదు!

లోపల దహించుకుపోతూంది. ఏదో అనుమానం! ఏమీ తోచక రోషంతో యిటూ అటూ కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నాడు.

"ఊఁ! ఎప్పుడూ... యింతే...నే వచ్చేసరికి!... ఉండదు! ఏమిటో ఆ రాచకార్యాలు? అయినా ఎంతట్టో వెళ్ళిపోయింది!"

అని అర్థం లేకండా అంటూ కోపంతో చేతిలోవున్న పుస్తకాన్ని టేబిలుమీద గిరాటు వెయ్యడంతో... అక్కడున్న పూల కూజాకి తగిలి పెద్దశబ్దంతో క్రిందబడి... ముక్కలూ చక్కలూ అయింది!

"ఇక్కడా పెట్టుగుంటారు!" అని సొణుగుకుంటూ... పెరట్లోకి పోయి "ఏయ్" అని పెంకులెగిరినట్టు అరిచేడు ... జవాబు లేదు... అతడు తిరిగి నా వేపు అతి వికారంగా చూశాడు...

ఆ నిశ్శబ్దాన్ని... ఆ ప్రవర్తనని నే సహించలేక "అలా బజారు కెళదాం రావోయ్!" అని అన్నాను. సందర్భానికి విరుద్ధం అయినా...

ఇంకా నా నోటంట ఆ ముక్క రాకముందే...

"లేదోయ్! నాక్కొంచెం పనుంది! నువ్వెళ్ళు" అన్నాడు ... నన్ను వదిలించుకుంటే చాలన్న ధోరణిలో... ఎప్పుడూ అలా అని ఎరుగని విశ్వం.

ఆపాదమస్తకం ఎరుపెక్కిపోయింది.

ఒళ్ళంతా చెమటలు పోశేశాయి.

లోలోపలే పళ్ళు కొరుకుతున్నాడు.

ఇంతలో ఆ భయంకర వాతావరణాన్ని, భరించలేని మౌనాన్ని ఛేదించుకుంటూ— మేంతుళ్ళుపడ్డట్టు— కిలకిల లాడుకుంటూ... ఆ పెరట్లోకి వచ్చేరు వాళ్ళిద్దరూ... పక్కింటి... పేరంటానికి వెళ్ళి.

"మీరు కూడా వచ్చారే" అని వాళ్ళిద్దర్లో ఒకర్నిచూసి అన్నాడు విశ్వం. అంతలా మారిపోయిన విశ్వంలోనూ ఒక్క క్షణంలో తిరిగి మార్పువచ్చింది—

ఇప్పుడు అతని ముఖం నిర్మలంగా వుంది. మనిషి తేలిగ్గా అవుపించేడు.

"చెప్పేవు కాదేంవోయ్! ఎంతసేపయింది మీరొచ్చి!" అని నవ్వుతూ నావైపు తిరిగి పూర్వంలా సహజంగానే అడిగాడు.

"ఇప్పుడేనోయ్! ఆఫీసు వదలగానే—అనుకోకుండా రావాలనిపించి వచ్చేం. అయినా నువ్వింత వేగంగా వచ్చాశావేం?" అని అన్నాను.

"అబ్బే! నువ్వొస్తావనే!" అని తణువుకుంటూ తెల్లపోయి అన్నాడు. నేవచ్చినందుకు ఇంతసేపూ తల్లక్రిందులయి బాధపడిన విశ్వం.

"ఇంక వెళదాం రండి పొద్దు పోయింది" అని నా భార్య కమల, విశ్వనాథం భార్య లక్ష్మిచేత బొట్టు పెట్టించుకొని నా దగ్గరికి వచ్చింది.

వాళ్ళిద్దర్నీ వుండమని చెప్పి మేం ఇద్దరం ఇంటికి వచ్చేసేం. విశ్వం వెలవెలబోతూ నవ్విన నవ్వు ఇప్పటికీ మరచిపోలేను.

ఆనందవాణి